సాక్షి
వైఎస్సార్ జిల్లా



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

ఉద్యాన సాగుకు ప్రోత్సాహం



కడప అగ్రికల్చర్: ఉపాధి హామీ, ఉద్యానశాఖ, ఏపీ ఎంఐపీతోపాటు పట్టు పరిశ్రమశాఖల సమన్వయంతో 50 వేల ఎకరాల అదనపు విస్తీర్ణం కింద ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహానికి మండల, గ్రామస్థాయి ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి జి. సతీష్ తెలిపారు. గ్రామస్థాయిలో సభలు నిర్వహించి అర్హత ఉన్న ప్రతి రైతును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 100 శాతం రాయితీతో ఎస్సీ, ఎస్టీ రైతులకు, 90 శాతం సబ్సిడీతో చిన్న, సన్న కారు రైతులకు బిందు, తుంపర సేద్య పరికాలు పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి తెలిపారు.

కిలో టమాట @ రూ.2



రాయచోటి మార్కెట్‌లో టమోటాలను విక్రయిస్తున్న దృశ్యం

రాయచోటి: టమాటా రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. పంట చేతికొచ్చినా మార్కెట్‌లో ధరలు దారుణంగా పడిపోవడంతో లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం కిలో టమాటా ధర రైతులకు రెండు రూపాయలు మాత్రమే లభిస్తోంది. మదనపల్లి, గుర్రంకొండ, కలకడ, కలికిరి, రాయచోటి మార్కెట్‌లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజురోజుకు పతనమవుతున్న ధరలతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కిలో టమోటా ఎనిమిది రూపాయలకు కొనుగోలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ వ్యాపారులు వీటిని పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఇబ్బందిగా ఉంది...

ఈయన పేరు శ్రీరాములు. కడప గౌస్‌నగర్‌లో ఉంటున్నారు. స్థానిక సచివాలయ సిబ్బంది పింఛన్ కోసం సచివాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు. అనారోగ్యం కారణంగా ఆయన నడవలేని స్థితిలో ఉన్నారు. పింఛన్ పొందాలంటే వెళ్లక తప్పదు. ఇతరుల సాయంతో పింఛన్ కోసం కష్టం మీద సచివాలయానికి వెళ్లారు. తనలాగా అనారోగ్యంతో ఇల్లు దాటలేని వారు ఎంతో మంది ఉన్నారని.. ఇంటికాడికే వచ్చి ఇస్తే బాగుంటుందని విన్నవించాడు.

పింఛన్ కష్టాలు!

- మూన్నాళ్ల ముచ్చటగా మారిన ఇంటివద్దకే పింఛన్
- పింఛను కోసం సచివాలయాల వద్ద వృద్ధుల ఎదురుచూపులు
- సిబ్బంది నిరసన, సర్వర్ డౌన్‌తో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి
- కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది అంటున్న ఫింఛన్‌దారులు

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పొద్దుపొడవక ముందే ఠంచన్‌గా ఇంటి ముంగిటకు పింఛన్ వచ్చి చేరేది. వలంటీర్ల వ్యవస్థ వృద్ధులకు ఊతకర్రలా నిలిచింది. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో ఉంటే అక్కడికే వెళ్లి పింఛన్లు అందించే గొప్ప వ్యవస్థ అది. ప్రభుత్వం మారింది.. కూటమి సర్కార్ కొలువుదీరింది.. అంతే.. వృద్ధులకు కష్టాలు మొదలయ్యాయి. పడిగాపులు పడే ఆ పాత రోజులు మళ్లీ వచ్చి చేరాయి. ఇళ్ల వద్దకే పింఛన్లు చేరుస్తామంటూ నమ్మబలికిన కూటమి పెద్దలు మూన్నాళ్లకే మాట మార్చారు. తాజాగా ఈ నెల ఒకటోతేదీ బుధవారం రోజు పింఛన్ కోసం వృద్ధులు సచివాలయం వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది.

● సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే ముందుగా పింఛన్‌దారులపై కత్తి కట్టారు. సాధ్యమైనన్ని పింఛన్లు కోత కోసం దుకు సమాయత్తమయ్యారు. అనర్హుల పేరిట నిజమైన అర్హులకు అన్యాయం చేస్తూ చర్యలకు దిగారు. జిల్లా వ్యాప్తంగా 7,182 మందికి నోటీసులు జారీ చేశారు. రీ–వెరిఫికేషన్‌లో సదరం సర్టిఫికెట్లు కోసం దివ్యాంగులు ముప్పుతిప్పలు పడ్డారు. ఇదిలా ఉంటే ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు చేరవేస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు సర్కార్ తక్కువ కాలంలోనే మాటమార్చింది. జిల్లా వ్యాప్తంగా 2,56,817 పింఛన్లు ఉంటే అందులో వృద్ధులు 1,28,647 మంది ఉన్నారు. 36,735 వికలాంగులు, 63,775 మంది వితంతువులున్నారు. వీరందరికి ఇంటివద్దకు పింఛన్ చేరాల్సిన అవశ్యకత ఉంది. అలాంటిది బుధవారం ఉదయం ఇంటి వద్ద పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు సచివాలయం బాట పట్టారు. అక్కడ సర్వర్ పనిచేయక గంటల తరబడి డబ్బుకోసం ఎదురు చూపులు తప్పలేదు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు ఎన్నికలల్లో హామీ ఇచ్చారు. కొత్తగా పెన్షన్లు దేవుడెరుగు, ఉన్న పింఛన్లు కోత పెట్టడం, నడవలేని స్థితిలో సచివాలయం వద్దకెళ్లి పడిగాపులు కాస్తుండడం చంద్రన్న సర్కార్‌కే చెల్లిందని పలువురు వాపోతున్నారు.



కడప నగరంలోని రవీంద్రనగర్ సచివాలయం పై అంతస్తులో ఉండడంతో మెట్లు ఎక్కేందుకు వృద్ధుల అవస్థలు

మళ్లీ పాత రోజులు వచ్చాయి...



ఒకటవ తేదీన పింఛన్ ఇంటి వద్దకే వస్తుందని మేమంతా ఎదురు చూస్తుంటాం. అయితే ఈ సారి పింఛన్ తీసుకోవడానికి సచివాలయానికే రావలసిన పరిస్థితి వచ్చింది. పింఛన్ కోసం ఇక్కడికి రావడం చూస్తుంటే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. సమస్య ఏదైనా సరే ముసలోళ్ల..ఆరోగ్యం బాగాలేని వారి పరిస్థితులను పరిశీలించి, పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేలా చూడాలి. – ఉస్మాన్, గౌస్‌నగర్, కడప.

ఇబ్బందిగా ఉందయ్యా..



నా పేరు అక్బర్. మేము కడప నగరం 31వ డివిజన్‌లో నివసిస్తున్నాం. నేను అనారోగ్యంతో మంచాన పడ్డా. నా భార్య పుట్టుకతో చెవిటి మూగ. గత ప్రభుత్వంలో తెల్లవారుజామున వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందించేవారు. కానీ ఇప్పుడు వ్యయ ప్రయాసలతో ఏడురోడ్ల వద్ద ఉన్న సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నాం. – అక్బర్ దంపతులు

నడలేని స్థితిలో సచివాలయానికి వచ్చాను



నేను కడప నగరం రమేష్ హాలు ఎదురు వీధిలో నివసిస్తున్నాను. వృద్ధాప్యంలో ఉన్నా. ..పైగా బోదకాలు. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అనేక వ్యయ ప్రయాసలతో ఆటోలో రూ. 100 వెచ్చించి సచివాలయానికి వచ్చి పెన్షన్ తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంది. – షకీల, కడప

ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి తగదు



నేను ప్రస్తుతం కటిక వీధిలో నా కుమార్తె వద్ద ఉంటున్నాను. పెన్షన్ కోసం నకాష్‌లోని సచివాలయంకు వచ్చేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాను. కిలోమీటరు దూరంలో ఉన్న సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాలని చెప్పడంతో ఇక్కడికి వచ్చేందుకు శ్రమించాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇబ్బంది పెట్టకూడదు. – రమీజాబీ, కడప

4,5 తేదీల్లో దసరా ప్రత్యేక సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగకు సొంతూళ్లకు వచ్చిన వారి తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ముఖ్య ప్రాంతాలకు జిల్లాలోని ఆరు డిపోల నుంచి ఈనెల 4, 5 తేదీలలో సాధారణ ఛార్జీలతో 80 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరు 35, హైదరాబాద్ 25, విజయవాడ 10, చెన్నైకి 10 బస్సులు వెళతాయని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జయములివ్వు.. జగజ్జననీ

- జిల్లా అంతటా దసరా సందడి
- ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న ఆలయాలు
- శమీ వృక్ష దర్శనానికి ఏర్పాట్లు పూర్తి
- అమ్మవారి ఆలయాలు, ఇళ్లల్లో ఆయుధపూజ



కడప సెవెన్‌రోడ్స్: పది రోజుల శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా అంతటా సందడి నెలకొన్న సందడి నెలకొంది. మనలోని చెడును ప్రక్షాళన చేసుకునేందుకు మన పెద్దలు ఈ పండుగ ద్వారా ఓ మంచి అవకాశం కల్పిస్తున్నారు. మంచి వారికి నిత్యం విజయాలనే అందిస్తాయి. ఇకనైనా మంచిగా మారకపోతే కఠిన దండన తప్పదంటూ దుర్మార్గులకు ఈ పండుగ హెచ్చరిస్తోంది. దసరా ఉత్సవాల సందర్భంగా కడప, ప్రొద్దుటూరులతోపాటు ఇతర అన్ని ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలు శోభాయమానంగా కనిపిస్తున్నాయి.

ఆయుధ పూజ: నవరాత్రి ఉత్సవాలలో చివరిరోజైన విజయదశమికి ఎంతో విశిష్టతమైంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను నిర్వహిస్తారు. అందులోని సామాజిక, నైతిక విషయాలను అటుంచితే కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు విజయం సాధించిన రోజని, రాముడు రావణాసురుని మట్టుబెట్టిన రోజని, భగీరథుడు గంగను దివి నుంచి భువికి దించిన రోజు అని పురాణాల్లో ఉండడంతో ఈ రోజుకు ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ సందర్భంగా ఆలయాల్లోనూ, ఇళ్లలోనూ ఆయుధ పూజ నిర్వహిస్తారు. జయములివ్వు మాతా అంటూ అమ్మవారిని వేడుకుంటారు.



కడప: కన్యకాపరమేశ్వరీదేవిగా వాసవాంబ



విద్యుద్దీప కాంతుల్లో శ్రీ లలిత పంచాయతన ఆలయం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో గాయత్రీదేవి అలంకారం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నేడు మహాత్మాగాంధీ ఛాయాచిత్ర ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక, సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో కడప ఐటీఐ సర్కిల్ వద్ద గాంధీజీ ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజీ జీవిత ఘట్టాలు, జీవిత సందేశం, స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ఆయన పాత్ర, వర్ధమాన ప్రపంచానికి గాంధీజీ అవశ్యకతపై ఛాయాచిత్ర ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో చైతన్యం పెంచాలని కోరుతూ ప్రత్యేక వినతి పత్రం గాంధీజీ విగ్రహానికి సమర్పించనున్నట్లు జేవీవీ నేతలు తెలిపారు.

- రాత్రి అమ్మవారి తొట్టిమెరవణి
- ఉత్సవాల్లో 2.50 లక్షల మందికిపైగా భక్తులు

నేడు శమీదర్శనం

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు పట్టణంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు చివరి అంకానికి చేరాయి. విజయదశమి పర్వదిన సందర్భంగా గురువారం అమ్మవారికి శమీదర్శన మహోత్సవం నిర్వహించనున్నారు. దసరా మహోత్సవాలలో వాసవీ మాత శమీదర్శనం, తొట్టిమెరవణి అత్యంత ముఖ్యమైనవి. ఈ ఉత్సవాలను తిలకించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి 2.50 లక్షల మందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనా. మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.50 గంటలలోపు మకరలగ్నంలో శమీ దర్శన మహోత్సవం ప్రారంభం కానుంది. పురవీధుల గుండా వైభవోపేతంగా అమ్మవారి శమీదర్శన మహోత్సవం ప్రారంభమై కొర్రపాడు రోడ్డులోని శ్రీవాసవీ శమీదర్శన మండపానికి చేరనుంది. విజయానికి, సంపదకు చిహ్నమైన శమీ వృక్షాన్ని దర్శించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని ప్రతీతి. అందువల్లే విజయదశమి నాడు అమ్మవారికి శమీదర్శనం చేయించి తమకు విజయాలు, సిరిసంపదలు ఇవ్వమని అమ్మవారిని వేడుకోవడం ఆనవాయితీ. కాగా పట్టణంలోని పలు ఆలయాల నిర్వాహకులు దేవతా మూర్తులను విశేష అలంకరణ చేసి ప్రత్యేక రథం, వాహనాల్లో వేడుకగా కొర్రపాడు రోడ్డు మిల్లులలోని శమీవృక్ష దర్శనానికి మంగళవాయిద్యాలు, బాణసంచా పేళుల్ల, వివిధ కళాబృందాల మధ్య వైభవంగా చేరుకుంటారు. అన్ని ఆలయాల నుంచి వచ్చిన స్వామి, అమ్మవారి వైభవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో కొర్రపాడు రోడ్డు జనసంద్రం కానుంది.



అమ్మవారి పంచలోహ రథం

విజయలక్ష్మీదేవి గ్రామోత్సవం (తొట్టిమెరవణి): శ్రీవాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారికి రాత్రి 10.30 గంటల నుంచి 12 గంటల లోపల మిథున లగ్నంలో తొట్టిమెరవణి ప్రారంభంకానుంది. పంచలోహంతో తయారు చేసిన తొట్టి మెరవణి రథంలో అమ్మవారి శ్రీ చక్రంను ఏర్పాటుచేశారు. ఈ రథం పర్యటించిన ప్రాంతంలో అశుభాలు, చెడులు తొలగిపోయి సర్వశుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో పురవీధులలో కన్నుల పండువగా తొట్టిమెరవణిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కళ్లుమిరుమిట్లు గొలిపే వివిధ రకాల బాణసంచా వెలుగులతో ఆప్రాంతం నూతన శోభసంతరించుకోనుంది. హర్యానా కాళికామాత కళాకారులు, కాంతార కళాకారుల ప్రదర్శన, సినీ డూప్స్, కేరళ సింగారిమేళం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

క్లుప్తంగా

ఐచర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన జయప్ప

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని సంచుల ఫ్యాక్టరీ వద్ద చీనీ కాయల లోడుతో వెళుతున్న ఐచర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా యల్లనూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన జయప్ప(58) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఐచర్ వాహనం లింగాల నుంచి చీనీ కాయల లోడుతో పులివెందులకు వస్తుండగా సంచుల ఫ్యాక్టరీ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో జయప్ప తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రాజు తెలిపారు.

నిలిచి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


ప్రమాదానికి గురైన లారీలు

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిపై మండలంలోని యామవరం గ్రామ సమీపంలో మరమ్మతులకోసం నిలిచివున్న లారీని వెనుకనుంచి వచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. బుధవారం తెల్లవారుజామున ఐరన్‌మట్టి లోడుతో ప్రయాణిస్తున్న లారీ ముందువైపు బూడిద లోడుతో నిలబడివున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుకవైపు ఉన్న లారీలో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టి అతన్ని బయటకు తీశారు. బాధితుడికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై కేసు

ముద్దనూరు : అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భర్తతో పాటు మరో ముగ్గురిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు .ఏఎస్ఐ రమేష్ సమాచారం మేరకు మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వాసంతి అనే మహిళకు ఏడేళ్ల క్రితం ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డితో వివాహమైంది. వివాహమైన కొద్ది సంవత్సరాల నుంచి అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు అత్తమామలు, బావ కొండారెడ్డిలు తనను వేధిస్తున్నారని వాసంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై వర కట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్‌లు అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు ప్రమాదాల్లో బైక్‌లు అదుపు తప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి(40) బుధవారం బోయకొండకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా, కొండ దిగేటప్పుడు బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, అత్యవసర విభాగంలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా బోయకొండకు చెందిన సునీల్(25) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. బోయకొండ సమీపంలోనే వేగంగా వెళుతూ వాహనాన్ని అదుపుచేయలేక కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆల్మట్టిపై చంద్రబాబు మాట్లాడరెందుకు.?

- ప్రాజెక్టు ఎత్తు పెంచితే రాయలసీమ ఎడారే
- గతంలో ఆల్మట్టి ఎత్తు పెంచినా నోరు మెదపని బాబు
- ఇప్పుడు ఎన్‌డీఏతో పొత్తులో ఉన్నా అడ్డుకోకపోవడం అన్యాయం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచేందుకు కర్నాటక కేబినెట్ తీర్మాణం చేసి, టెండర్లు కూడా పిలుస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనం వహించడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇక్కడి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1995లో దేవెగౌడ సర్కార్ ఆల్మట్టి ఎత్తును 509 నుంచి 524 మీటర్లకు పెంచుతూ పనులు చేపట్టినా అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నోరు మెదపకుండా రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. 1996 లోక్‌సభ ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ ఛైర్మెన్‌గా వ్యవహరించిన బాబు, కర్నాటక సీఎం దేవగౌడను ప్రధానిగా చేయడంలో తానే కీలకంగా వ్యవహరించినట్లు చెప్పుకుంటారన్నారు. ఆయన ప్రధాని అయ్యాకే ఆల్మట్టి డ్యామ్‌కు నిధులు మంజూరై పనులు పూర్తయ్యాయన్నారు. ఇలా అప్పట్లో ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకోకుండా చంద్రబాబు రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. తాజాగా ఆల్మట్టి డ్యామ్ నీటి నిల్వ ఎత్తును 509 నుంచి 524 మీటర్లకు పెంచుతూ కేబినెట్ తీర్మాణం చేసిందన్నారు. దీంతో ఆల్మట్టి డ్యామ్ సామర్థ్యం 129.72 నుంచి 270.72 టీఎంసీలకు పెరుగుతుందన్నారు. కర్నాటక చర్యల వల్ల కృష్ణా జలాలు రాష్ట్రానికి వచ్చే పరిస్థితులు ఉండవన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఎగువ నుంచి చుక్క నీరు కూడా కిందికి రాదన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లపై ఆధార పడ్డ ప్రాజెక్టుల ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే పోలవరం నుంచి బనకచర్ల క్రాస్ వరకూ అనుసంధానిస్తామని, సోమశిల అనుసంధానం అంటూ ముఖ్యమంత్రి పొంతన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఒకవైపు కర్నాటక, మరోవైపు తెలంగాణ ప్రాజెక్టులు నిర్మించడం వల్ల రాయలసీమ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మొదలు పెడితే పర్యావరణ అనుమతులు లేవనే సాకుతో ఆ పనులు పూర్తి చేయకుండా ఉన్నారన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంతో పొత్తులో ఉన్న చంద్రబాబు పర్యావరణ అనుమతులు తీసుకొచ్చి ఈ పనులు పూర్తి చేయలేరా అని ప్రశ్నించారు. జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌ను కలిపే పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. 17 ఏళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, రాయలసీమకుగానీ ఇతర ప్రాంతాల అభివృద్ధికిగానీ చేసింది శూన్యమన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు పెంచారన్నారు. నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, పుట్టపర్తి జిల్లాలను ఏర్పాటు చేసి, కొప్పర్తి, ఓర్వకల్లు సెజ్ ఏర్పాటు చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి మేలు చేశారన్నారు. ఈవెంట్ల పేరుతో వారానికొసారి ఢిల్లీకి, నిత్యం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపుపై ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందన్నారు. దీనిపై పోరాటం చేసి భవిష్యత్ తరాలకు నష్టం కలగకుండా చూడాల్సిన సమయం వచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రూ.3లక్షల కోట్లు అప్పు చేస్తే 17 నెలల్లోనే చంద్రబాబు రూ.2లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ వివేకా హత్య కేసును పదే పదే ప్రస్తావించారని, అధికారంలోకి వచ్చి 17 నెలలైనా ఆ కేసును ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో ఆధారాలు దొరకలేదని, కోర్టులో ఈ కేసు వీగిపోయే అవకాశం ఉందన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచకుండా ప్రభుత్వం అడ్డుకోవాలని, టెండర్లు వెనక్కి తీసుకునేలా పలుకుబడిని ఉపయోగించాలని సూచించారు. భవిష్యత్‌లో శ్రీశైలంపై ఏ ప్రాజెక్టు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్, వేర్‌హౌస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎస్ఏ కరిముల్లా, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షఫీవుల్లా, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడు ఫయాజ్ పాల్గొన్నారు.

వయో వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్


మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : వయోవృద్ధులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. కడప కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవా సదన్‌లో ×న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్స్ తో పాటు, అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వృద్ధుల జీవితాలను ప్రభావితం చేసే సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. భద్రత కల్పించాల్సిన వృద్ధులను విడిచిపెట్టినా, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుము లేదా రెండింటినీ కలిపి విధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్, పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్.రామమూర్తి నాయుడు, వృద్ధాశ్రమాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రేటు తగ్గుదలతో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

కడప అగ్రికల్చర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ రేటు తగ్గించడంతో రైతులకు సాగు ఖర్చు తగ్గుతుందని, వ్యవసాయోత్పత్తులపై పన్నుభారం తగ్గడం వలన కొనుకొనుగోలు శక్తి పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. జిల్లా రైతుల కోసం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌– జీఎస్టీ -2.0 పై బుధవారం కడప ప్రభుత్వ పురుషుల జూనియర్ కళాశాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన సదుస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా వ్యవసాయ అధికారితోపాటు జీఎస్టీ సంయుక్త కమిషనర్ సుమతి, ఉద్యానశాఖ అధికారి సతీష్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరెడ్డి, సెరికల్చర్ జిల్లా అధికారి రామశివదీక్షిత్(ఎఫ్ఏసీ), ప్రకృతి వ్యవసాయ డీపీఎం ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంయుక్త కమిషనర్ సుమతి మాట్లాడుతూ ట్రాక్టరు, హార్వెస్టింగ్ వంటి వ్యవసాయ యంత్రాలపై పన్ను 18 నుంచి 5 శాతం, ఎరువులు, పురుగు మందులు, బయో పెస్టిసైన్సుపై పన్ను 12 నుంచి 5 శాతం తగ్గిందన్నారు. అలాగే నీటి పారుదల పరికరాలు, స్ప్రింక్లర్లు, బిందు సేద్య పరికరాలు ఇతర నీటి పారుదల పంపులపై 12 నుంచి 5 శాతానికి తగ్గింపు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఏడీఏ లక్ష్మిమాధవి, కడప ఏఓ సురేష్‌కుమార్‌రెడ్డి, ఏఈఓలు సరిత, రాధిక, కవితతోపాటు రైతులు పాల్గొన్నారు.

ఫెయిల్యూర్ రహిత డిపోలుగా తీర్చిదిద్దాలి

ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి


మాట్లాతున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

మదనపల్లె సిటీ : జిల్లాలోని ఆర్టీసీ డిపోలను ఫెయిల్యూర్ రహిత డిపోలుగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి అన్నారు. బుధవారం మదనపల్లె ఆర్టీసీ-1,2 డిపోలను సందర్శించారు. బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. డిపో గ్యారేజీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 50 డిపోలు ఫెయిల్యూర్‌రహిత డిపోలుగా నమోదైనట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఫెయిల్యూర్ రహిత జిల్లాగా సాధించారన్నారు. మదనపల్లె వన్,టు డిపోలు ఫెయిల్యూర్ రహిత డిపోలుగా నమోదు కావాలని కోరారు. స్త్రీశక్తి పథకం సజావుగా నిర్వహించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్టాండు ఆవరణంలోని ఫ్లాట్‌ఫారం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, అమరనాథ్, సీసీఎస్ డెలిగేట్ వినోద్ బాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి


డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మహమ్మద్ తాహా, మహినూర్, కరిష్మా కోరారు. సమ్మెలో భాగంగా వైద్యులు బుధవారం కడపలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ఇన్-సరీ్వస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. అలాగే నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు 5000 రూపాయల అలవెన్స్, నేటివిటీ - అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి వినయ్‌కుమార్, డాక్టర్ మేరి సుజాత, డాక్టర్ జ్యోత్స్నతో పాటు ఇతర వైద్యులు పాల్గొన్నారు.

అందరికీ విజయాలు చేకూరాలి

– ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



పులివెందుల : జిల్లా ప్రజలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయ దశమి(దసరా పండుగ) అంటే చెడుపై మంచి సాధించిన విజయాలను గుర్తు తెస్తూ జరుపుకునే పండుగ అన్నారు. దుర్గా మాత మహిషాసురునిపై, రాముడు రావణుడిపై సాధించిన విజయాలకు ప్రతీక విజయ దశమి అన్నారు. ఈ పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, స్నేహితులతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రతి ఒక్కరికి తాము అనుకున్న మార్గంలో విజయాలు సాధించాలని కోరుకుంటున్నానన్నారు.

విజయదశమి శుభాకాంక్షలు

– జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



కడప అర్బన్ : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకను ఇంటిల్లిపాదీ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ దసరా పండుగ అందరికీ విజయాలు చేకూర్చాలని, చేపట్టిన ప్రతి కార్యం సఫలీకృతం కావాలని కోరుటుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, అన్ని వర్గాలవారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అభిలషించారు.

రిమ్స్‌లో గుర్తుతెలియని మృతదేహాలు



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు వైద్యం కోసం వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వేర్వేరు సమయాల్లో మృతి చెందారు. వారి మృతదేహాలను మార్చురీలో ఉంచారు. వారి వివరాలు తెలిసిన వారు ఎవరైనా వుంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

మెప్మా.. ఇదేంటి చెప్మా

- పీఎం సూర్య ఘర్ ఒక సంస్థకే
- డ్వాక్రా ఆర్పీలకు అధికారుల టార్గెట్లు
- ఆందోళనలో రిసోర్స్ పర్సన్లు



» పీఎం సూర్యఘర్ అంటే..

నివాస గృహాల రూఫ్‌పై సోలార్ ఫలకలు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78వేల వరకూ సబ్సిడీ ఇస్తుంది. లబ్ధిదారులు వెండార్స్‌ను ఎన్నుకొని వారి ద్వారా సోలార్ ఫలకలను అమర్చుకోవచ్చు. అలాగే బ్యాంకు లోన్ పొంది సబ్సిడీ పోను మిగిలిన మొత్తాన్ని ఈఎంఐల రూపంలో చెల్లించవచ్చు. ప్రతినెలా కరెంటు బిల్లుకు చెల్లించే మొత్తాన్ని ఈఎంఐ కడితే కొంత కాలానికి సోలార్ ద్వారా ఉచిత విద్యుత్ లభిస్తుంది. మొత్తంగా పీఎం సూర్యఘర్ పథకం ముఖ్య ఉద్దేశ్యం ఇది.

కడప కార్పొరేషన్: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం మాటున ఓ ప్రైవేటు సంస్థ, కొంతమంది అధికారులు అక్రమార్జన కోసం అడ్డదారులు వెతుకుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొంది సుమారు 20 సోలార్ రూఫ్ టాప్ అమర్చే ఏజెన్సీలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ కాదని ఎక్కడో గుంటూరుకు చెందిన ఆంధ్ర ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ ద్వారానే సోలార్ రూఫ్ టాప్ అమర్చుకునేలా విద్యుత్ వినియోగదారులను ఒప్పించాలని లక్ష్యాలు విధించడం హాట్ టాపిక్‌గా మారింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో స్వయం సహాయ సంఘాలకు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించే వారికి టార్గెట్లు విధించారు. ఒక్కో ఆర్పీ వంద కనెక్షన్లు చేయించాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. సోలార్ రూఫ్ టాప్‌లు అమర్చుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన తీసుకురావాలని గతంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సమావేశాలకు బ్యాంకర్లను కూడా పిలిపించి రుణాల మంజూరుకు హామీ ఇప్పించారు. కానీ కొద్దిమంది మాత్రమే ఆ దిశగా మొగ్గు చూపారు. ఇప్పుడు ఆర్పీల వంతు వచ్చింది. ఎలాగైనా సరే విద్యుత్ వినియోగదారులను ఒప్పించి సోలార్ రూఫ్‌టాప్ అమర్చేలా చేయాలని మెప్మా అధికారులు ఒత్తిడి తెస్తుండటంతో ఆర్పీలు లోలోన మథనపడిపోతున్నారు.

ఒకే ఒక్క ఏజెన్సీనే ఎందుకు...?

జిల్లాలో సుమారు 30 ఏజెన్సీలు ఉండగా ఒక్క ఆంధ్ర ఎంటర్‌ప్రైజెస్‌కు మాత్రమే లబ్ధి చేకూర్చేందుకు మెప్మా అధికారులు టార్గెట్లు విధించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ కంపెనీ ప్రతినిధులతో మెప్మా అధికారులు కుమ్మక్కై తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆర్పీలు వాపోతున్నారు. ఆర్పీల సమావేశంలో కంపెనీ ప్రతినిధులను కూర్చొబెట్టి వంద కనెక్షన్లు చేయాలని నిర్దేశిస్తున్నట్లు తెలుస్తోంది. లేదంటే సెలవుపై వెళ్లాలని బెదిరిస్తున్నారని సమాచారం. కడపలో 210 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి వంద చొప్పున అంటే 20వేల కనెక్షన్లు చేయాలని టార్గెట్ ఇచ్చి మరీ బెదిరించడం విమర్శలకు తావిస్తోంది. టార్గెట్లు పూర్తి చేస్తే కమీసన్లు ఇస్తామని ప్రలోభాలకు కూడా గురిచేస్తున్నట్లు తెలిసింది. సోలార్ రూఫ్ టాప్ గురించి విస్తృత అవగాహన కల్పించడంలో ఎలాంటి తప్పులేదు కానీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేల ఫోటోలతో కరపత్రాలు ప్రచురించడం, ప్రభుత్వమే ఆ కంపెనీని ప్రోత్సహిస్తునట్లు మభ్యపెడుతున్నట్లు తెలుస్తోంది. ఆంధ్ర ఎంటర్‌ప్రైజెస్ ద్వారానే సూర్య ఫలకలు అమర్చేలా మెప్మా అధికారులు అత్యుత్సాహం చూపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్లపై సూర్య ఫలకలు అమర్చిన ఏ ఏజెన్సీ అయినా ఐదేళ్లపాటు సర్వీసు అందించాల్సి ఉంటుంది. స్థానికంగా ఉన్న ఏజెన్సీలు, వెండార్స్ అయితే కొంత మేరకైనా జవాబుదారీగా ఉండే అవకాశముంది. గుంటూరులో ఉండే ఈ ఆంధ్ర ఎంటర్‌ప్రైజెస్ ఏ మేరకు సర్వీసు అందిస్తున్నది ప్రశ్నార్థకంగా మారింది. వారు నాసికరం సూర్య ఫలకలు అమర్చి భవిష్యత్‌లో ఏవైనా సమస్యలు వస్తే వినియోగదారులు ఎవరిని అడగాలి, ఒప్పించి కనెక్షన్లు ఇప్పించిన మెప్మా అధికారులనా...ఆర్పీలనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

విధుల్లోకి సీఐ రామకృష్ణ

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప ఒన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ వి.ఆర్‌కు సెప్టెంబర్ 29వ తేదీన వెళ్లారు. బుధవారం మరలా ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన ఒన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు వేరే కేసుపై విచారణ కోసం విధులకు వెళ్లి వచ్చానని తెలిపారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

కమలాపురం : జిల్లాలోని ఉల్లి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. వర్షాలతో ఉల్లి రైతులు గుల్ల కావడంతో గత నెల ఉమ్మడి కడప జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబు క్వింటా ఉల్లి రూ.1200 కు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే సీఎం ఇచ్చిన ఆ హామీ క్షేత్రస్థాయిలో అమలు కాక పోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వర రావు, రైతులు రామసుబ్బారెడ్డి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసూ..నీ తీరు బాగోలేదు!

- నిన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి అసమ్మతి గళం
- ఇప్పుడు పెద్ద దర్గా నుంచి ముస్లిం మైనార్టీ నేతల తిరుగుబాటు
- తరువాత ఎదురుతిరిగేది ఎవరో..?
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసుపై తమ్ముళ్ల పోరు బావుటా..!



కడప రూరల్ : జిల్లా తెలుగుదేశం పార్టీలో ఐక్యత కలగా మారింది. ప్రతి నియోజకవర్గంలో వర్గ పోరు..అసమ్మతి సెగలు ఎగిసిపడుతున్నాయి. కాగా అన్ని నియోజక వర్గాలు ఒక ఎత్తయితే కడప నియోజకవర్గం ప్రత్యేకంగా మారింది. అధిష్టానానికి తల నొప్పిగా తయారైంది. ఇక్కడ నిత్యం ఆ పార్టీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇటీవల ఆ పార్టీకి చెందిన నాయకుడు పాత కడప క్రిష్ణారెడ్డి తిరుమల తొలి గడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి సన్నిధి నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులురెడ్డిపై బహిరంగంగానే తిరుగుబాటు ప్రకటించారు. అంతేకాదు తమకు అండగా, పెద్ద దిక్కుగా ఉండాలని కోరుతూ పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో వాహనాల్లో కమలాపురం వెళ్లి ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని కలవడం పెద్ద దుమారమే లేపింది.

ముస్లిం మైనార్టీ నేతల మండిపాటు...

ఈ నేపథ్యంలో కడప నియోజకవర్గంలో కీలకంగా ఉన్న ముస్లిం మైనార్టీ నేతలు పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి తీరుపై మండిపడుతున్నారు. టీడీపీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులను కాదని పార్టీ ఫిరాయింపుదారులకు, తన అనుచరులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం పట్ల తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఆ పార్టీ నూతన కడప నగర కమిటీని పార్టీ కార్యకర్తలు తిరస్కరించారు. అయితే పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి, కార్యకర్తల అభిప్రాయాలను ఏ మాత్రం లెక్క చేయకుండా ఏకపక్షంగా కమిటీని నియమించారని కార్యకర్తలు బహిరంగంగానే ఆరోపించారు. అనంతరం విలేకరుల సమావేశంలో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 'సీనియర్లు లేదు..తోలు తొక్క లేదు. టీడీపీ అంటే రెడ్డెప్పగారి కుటుంబమే' అని వ్యాఖ్యానించడంతో తమ్ముళ్లలో మరింతగా ఆగ్రహావేశాలు నింపాయి. ఈ తరుణంలో ముస్లిం మైనార్టీ నేతలు పార్టీలో తమ వర్గానికి ఎలాంటి గుర్తింపు, ప్రాధాన్యత లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకుడు అమీర్‌బాబును వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా ప్రకటించాలనే వాదన తెరపైకి తెచ్చారు. అలాగే పలు అంశాలకు సంబంధించి ఇటీవలనే ఒక డివిజన్‌లోని పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడి నివాసంలో, ఆ పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ కార్యకర్తలంతా సమావేశమయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా అందరూ ఒకే తాటిపైకి వచ్చారు. ఆ మేరకు ఈ నెల 20వ తేదీ లేదా మరెప్పుడైనా సరే పెద్ద దర్గాలో ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించి, కడప నగరంలోని 20 డివిజన్లలోని పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలతో 20కిపైగా వాహనాల్లో కమలాపురం వెళ్లి, ఆ పార్టీ నేత పుత్తా నరసింహారెడ్డిని కలిసి 'పెద్దాయనా' నీవే మాకు దిక్కు, సీనియర్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరనున్నట్లు సమాచారం. ముస్లిం మైనార్టీల తరువాత మరొక సామాజిక వర్గానికి చెందిన నేతలు సైతం అసమ్మతి జెండాను ఎగురవేయనున్నట్లు తమ్ముళ్లు చెబుతున్నారు. వాసూ..నీ తీరు ఏ మాత్రం బాగోలేదని ఆ పార్టీ శ్రేణులు బహిరంగంగానే చెబుతున్నాయి. రోజుకో అసమ్మతి రాగంతో కడప టీడీపీలో గంగరగోళం ఏర్పడింది. రేపేమి జరుగుతుందో అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.